సాక్షి అనకాపల్లి

సోమవారం । 31 । జూలై । 2023



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.



సింహాచలంలో ఆర్టీసీ ఈడీ

సింహాచలం: ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ సింహాచలంలో స్టాల్స్, పార్సిల్ పాయింట్‌ను తనిఖీ చేశారు.



అలరించిన కోలాటం

విశాఖ: రుషికొండలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి భక్తుల కోలాటం అలరించింది.

న్యూస్‌రీల్

నిండుకుండలా 'రైవాడ'



కనుచూపు మేర నీటితో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

దేవరాపల్లి: రైవాడ జలాశయంలోకి 300 క్యూసెక్కుల నీరు (ఇన్‌ఫ్లో) వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 110.40 మీటర్లు ఉంది. ఇటీవలి వర్షాలతో రిజర్వాయర్ నిండుకుండలా దర్శనమిస్తోంది. ఏమాత్రం భారీ వర్షం కురిసినా నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశం ఉండటంతో జలాశయం పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

వరల్డ్ వర్సిటీ గేమ్స్‌కు అథ్లెట్ జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: చైనాలో జరగనున్న వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొనేందుకు హర్డిల్ ఫాస్టెస్ట్ స్ప్రింటర్ జ్యోతి ఎర్రాజీ పయనమైంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఈ పోటీలు జరగనుండగా వంద మీటర్ల వుమెన్ హర్డిల్స్‌లో జ్యోతి పాల్గొననుంది. ఇటీవల ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించి డబ్ల్యూయూజీలో సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరఫున ఈ పోటీల్లో పాల్గోనుంది.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

నేడు కోర్టుల బహిష్కరణ

విశాఖలీగల్ : విజయవాడ న్యాయవాదుల సంఘానికి చెందిన న్యాయవాది ఆర్.ఆదిశేష విఠల్‌బాబు దారుణ హత్యను విశాఖ న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు విశాఖ న్యాయవాదుల సంఘం కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు సోమవారం కోర్టులను బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. దీనికి న్యాయవాదులు అంతా సహకరించాలని కోరారు.

అల్లానికి రికార్డు ధర

సాక్షి, పాడేరు: ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది మన్యంతో పాటు సరిహద్దు ఒడిశాలోని గిరిజన రైతులకు అల్లం సాగు మంచి లాభాలనిస్తోంది. రికార్డు ధరతో వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేయడం వారికి ఊరటనిస్తోంది. మైదాన ప్రాంతాల్లో కిలో రూ.250 నుంచి రూ.300 వరకు అల్లంను రిటైల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. రెండు నెలల నుంచి అల్లంకు రికార్డు ధర నెలకొంది. ప్రస్తుతం హైబ్రిడ్ రకం అల్లంను కిలో రూ.180.దేశవాళీ అల్లం కిలో రూ.140తో వ్యాపారులు కొనుగోలు చేసి విశా ఖ, విజయనగరం, గాజువాక, తుని, రాజమండ్రి ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు నేరుగా గిరిజన గ్రామాలకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం అరకులోయ మండలంలోని సుంకరమెట్ట వారపుసంతకు వెళ్లి అల్లం కొనుగోలు చేశారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో మానవ హారం నిర్వహించిన క్రైస్తవ కుటుంబాలు

సాక్షి,పాడేరు: మణిపూర్ రాష్ట్రంలోని క్రైస్తవ కుటుంబాలపై హింసాత్మక సంఘటనలు,దుర్మార్గపు చర్యలకు నిరసనగా పాడేరు ప్రాంతంలోని క్రైస్తవులు ఆదివారం జిల్లా కేంద్రం పాడేరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతి ఏర్పడాలని పాస్టర్లు శామ్యూల్, తిమోతి పీఎంఆర్‌సీ జంక్షన్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఫ్రీ ఫర్ మణిపూర్..సేవ్ మణిపూర్ పేరిట పాడేరు పురవీధుల్లో మత పెద్దలు, క్రైస్తవులు నినాదాలు చేశారు. శాంతి ర్యాలీని అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించారు. ఆయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మానవహారంగా ఏర్పడి మణిపూర్‌లో క్రైస్తవులు,ఆదివాసీలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

కల్యాణపులోవ కళకళ

- వరునగా ఈ ఏడాది కూడా ఖరీఫ్‌కు సమృద్ధిగా నీరు
- కాలువల్లో పూడిక తీతతో శివారు భూములకు తీరిన కష్టం



ఉపాధి హామీ పథకంలో పూడిక తొలగించడంతో కొత్తగా కనిపిస్తున్న కాలువ



నిండు కుండలా ఉన్న కల్యాణపులోవ రిజర్వాయర్

రావికమతం: కల్యాణపులోవ రిజర్వాయర్ అయిదేళ్లుగా ఖరీఫ్‌కు ఢోకా లేకుండా నీరందిస్తూ వస్తోంది. జలాశయం పరిధిలోని 11 గ్రామాల్లో 5 వేల ఎకరాలు సస్యశ్యామలంగా ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఈ ఏడాది కూడా పుష్కలంగా నీటి నిల్వలున్నాయి. 460 అడుగుల నీటి సామర్థ్యం గల ఆ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 453 అడుగుల మేర నీరుంది. ఖరీఫ్ పంటకు 50 రోజులపాటు రోజుకు ప్రధాన కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. 450 అడుగుల మేర నీరుంటే సాధారణంగా సరిపోతుందని, ఈ ఏడాది 453 అడుగుల మేర ఉండటంతో ఇక ఢోకా లేదని ఇరిగేషన్ కొత్తకోట సెక్షన్ ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు.

కాలువల పూడికతీతతో శివారుకూ నీరు

కల్యాణపులోవ ప్రధాన కాలువతోపాటు పిల్ల కాలువలన్నింటిలో ఈ ఏడాది పూడిక తీశారు. కొన్నేళ్లుగా పూడుకుపోయిన కాలువలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చొరవతో ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో చేర్చి పూర్తిగా శుభ్రం చేశారు. దీంతో కాలువలన్నీ కొత్తగా కనిపిస్తూ కళకళలాడుతున్నాయి. గతంలో కాలువల్లో మట్టి, తుప్పలు పేరుకుపోవడంతో నీరు శివారు భూములకు చేరేది కాదు. ప్రస్తుతం పూడికేమీ లేకపోవడంతో రిజర్వాయర్ నీరు విడుదల చేసిన 24 గంటల్లో శివారు భూములకూ చేరుతుందని ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు.

రూ.10 లక్షలతో రెండు అక్విడెక్ట్‌లకు మరమ్మతులు

జలాశయం ప్రధాన కాలువకు చీమలపాడు, ములకలాపల్లి వద్ద గల రెండు అక్విడెక్ట్‌లు పాడవ్వడంతో నీరు వృథాగా పోతుండేది. పదేళ్లుగా ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి రూ.9.95 లక్షలు మంజూరు చేశారు. ములకలాపల్లి అక్విడెక్ట్‌కు రూ.4.95 లక్షలు, చీమలపాడు అక్విడెక్ట్‌కు రూ.5 లక్షలు వెచ్చించి ఈ ఏడాది పనులు చేపడుతున్నారు. వారం రోజుల్లో పనులు పూర్తవగానే నీరు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పదేళ్ల సమస్యకు పరిష్కారం



కల్యాణపులోవ రిజర్వాయర్ సమస్యలపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పదేళ్లుగా కాలువల్లో పూడిక పేరుకుపోయింది. ఉపాధి హామీ పథకంలో ఆ కాలువ పూడికతీతను చేర్చి సుమారు రూ.25 లక్షల వ్యయంతో అన్ని కాలువల్లో పూడిక తీయించారు. రెండు అక్విడెక్ట్‌ల నుంచి నీరు వృథాగా పోనివ్వకుండా ఎంపీ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి సుమారు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. త్వరలోనే పనులు పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధమవుతున్నాం.

–సత్యనారాయణ దొర,
ఇరిగేషన్ కొత్తకోట సెక్షన్ ఏఈ

సీఎం జగన్ విశాఖ పర్యటన రేపు



సాక్షి, విశాఖపట్నం: నగరంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 1వ తేదీ మంగళవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10 గంటలకు గన్నవరం విమానాశ్రయంలో బయలుదేరి 10.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.55 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 11.15 గంటలకు సాలిగ్రామపురంలో నిర్మించనున్న ఇనార్బిట్‌మాల్ స్థలానికి చేరుకుంటారు. అక్కడ మాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం హైటీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అదే ప్రాంగణంలో జీవీఎంసీకి చెందిన 50 పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. 12.25 గంటలకు అక్కడి నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి సిరిపురంలోని ఏయూ క్యాంపస్‌కు 12.40 గంటలకు చేరుకుంటారు. ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్(ఎలిమెంట్)తో సహా ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన భవనాలను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి 12.50కి బయలుదేరి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో విశ్వవిద్యాలయం విద్యార్థులతో సీఎం ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 1.20 గంటలకు బీచ్‌రోడ్డు నుంచి బయలుదేరి 1.40కు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.50 గంటలకు విశాఖ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయలుదేరి వెళ్లనున్నారు.

ఇనార్బిట్ మాల్‌కు చకచకా ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురం పోర్టు ఆస్పత్రి సమీపంలో ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులతో కలిసి ఆదివారం ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. శంకుస్థాపన ప్రాంగణం, పార్కింగ్, వేదిక, రెస్ట్ రూం తదితర పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం పక్కాగా ఉండాలని, ఎక్కడా వ్యర్థాలు లేకుండా పర్యవేక్షించాలని ఆరోగ్య విభాగం అధికారులకు సూచించారు. ఆయన వెంట జీవీఎంసీ అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, ప్రజా ఆరోగ్య అధికారి నరేష్ కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, ఆర్జీవీ కృష్ణ, మల్లయ్యానాయుడు, సింహాచలం, పర్యవేక్షక ఇంజినీర్లు, ఇనార్బిట్‌మాల్ ప్రతినిధులు ఉన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి పరిశీలించారు. సీఎం సందర్శించే ఎలిమెంట్ భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

విహారికి రావిశాస్త్రి సాహిత్య పురస్కార ప్రదానం



విహారికి పురస్కారం ప్రదానం చేస్తున్న డి.వి.సూర్యారావు, రఘురామారావు తదితరులు

సీతంపేట: ప్రముఖ కవి, కథా రచయిత, విమర్శకుడు జె.ఎస్.మూర్తి (విహారి)కి రావిశాస్త్రి సాహితీ పురస్కారం 2023 ప్రదానం చేశారు. విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్టు సంయుక్త నిర్వహణలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సభలో రచయిత డి.వి.సూర్యారావు, విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ రఘురామారావు, రావిశాస్త్రి తనయుడు ఉమాకుమారశాస్త్రి చేతుల మీదుగా విహారి దంపతులను సత్కరించి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా డి.వి.సూర్యారావు మాట్లాడుతూ విహారి ప్రాచీన, అధునిక సాహిత్య భావనలకు వారధి అని పేర్కొన్నారు. రావిశాస్త్రి రచనల వైశిష్ట్యాన్ని వివరించి, విహారికి రావిశాస్త్రి సాహితీపురస్కారం ప్రదానం చేయడం సముచితమన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో రావిశాస్త్రి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రావిశాస్త్రి అక్షర స్ఫూర్తి పుస్తకంలో 'రావిశాస్త్రి మనిషి బొమ్మలు' పేరిట విహారి రాసిన రెండు పేజీల వ్యాసం విశేషంగా ఆకట్టుకుందన్నారు. అప్పటినుంచి విహారిని విశాఖకు రప్పించి అతని ప్రసంగం వినాలని అనుకున్నట్టు తెలిపారు. చివరగా పురస్కార గ్రహీత విహారి తన స్పందనలో రావిశాస్త్రి రచనల్లోని మానవీయ విలువల్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రావిశాస్త్రి తనయుడు ఉమాకుమారశాస్త్రి, జె.పి. శర్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

'వైఎస్సార్ సీపీ వెంటే ఎంబీసీలు'

డాబాగార్డెన్స్ (విశాఖ): వైఎస్సార్ సీపీ వెంటే ఎంబీసీలున్నారని ఏపీ ఎంబీసీ సంఘాల గౌరవ అధ్యక్షుడు తుమ్మిడి రామ్‌కుమార్ తెలిపారు. ఏపీ ఎంబీసీ సమావేశం ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపంలోని తుమ్మిడి బ్రదర్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు చిన్న, వెనుకబడిన వర్గాల సమూహమే ఎంబీసీలని, రాష్ట్ర జనాభాలో 30 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో ఎంబీసీలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉంటారన్నారు. ఎంబీసీలో ఉన్న వారికి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కారానికి తామున్నామని హామీ ఇచ్చారు. ఎంబీసీలందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంబీసీలకు పలు నియోజకవర్గాలు కేటాయించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్దామన్నారు. సంఘం అధ్యక్షుడు గిడ్డయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కట్టా మల్లేశ్వరరావు, పొన్నాడ మోహన్‌రావు, చిత్రాడ అప్పారావు, ఉప్పు మీరా, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 13 డీసీసీబీ బ్రాంచిలు!

- ఈ ఏడాది వ్యాపార లక్ష్యం రూ.2,500 కోట్లు
- గత సంవత్సరంకంటే 20 శాతం అధికం
- ఖరీఫ్ పంట రుణాలు రూ.450 కోట్లు
- ఆర్బీకేకి ఒక సహకార సంఘం ఏర్పాటు యోచన



విశాఖ డీసీసీబీ భవనం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) సేవలను విస్తృతం చేస్తోంది. ఒక పక్క వ్యాపార లక్ష్యాన్ని పెంచుకుంటోంది. మరో పక్క పంట రుణాలను విస్తరిస్తోంది. ఇప్పటికే వాణిజ్య బ్యాంకులకు దీటుగా లావాదేవీలను కంప్యూటరీకరణ ద్వారా నిర్వహిస్తోంది. ప్రస్తుతం 30 డీసీసీబీ శాఖలున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 16, అర్బన్‌లో 14 బ్రాంచిలు నడుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో కొత్తగా 13 డీసీసీబీ శాఖలను ఏర్పాటు చేస్తోంది. విశాఖ జిల్లాలో రెండు (ఆనందపురం, పద్మనాభం), అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు (పెదబయలు, చింతపల్లి), అనకాపల్లి జిల్లాలో తొమ్మిది (రాంబిల్లి, మాకవరపాలెం, నాతవరం, బుచ్చయ్యపేట, గొలుగొండ, చీడికాడ, కోటవురట్ల, రోలుగుంట, సబ్బవరం) చోట్ల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతి లభించింది. కొత్త బ్రాంచిలు అందుబాటులోకి వస్తే విశాఖ డీసీసీబీ శాఖల సంఖ్య 43కు చేరుకుంటుంది. డీసీసీబీ బ్రాంచిల్లో రూ.225 కోట్ల వ్యాపారంతో అనకాపల్లి, రూ.200 కోట్లతో చోడవరం, రూ.180 కోట్లతో మాడుగుల శాఖలు ముందంజలో ఉన్నాయి.

వ్యాపార లక్ష్యం రూ.2,500 కోట్లు

విశాఖపట్నం డీసీసీబీ గత (2022–23) ఆర్థిక సంవత్సరం రూ.2,100 కోట్ల వ్యాపార లావాదేవీలను నిర్వహించింది. ఈ సంవత్సరం దానిని రూ.2,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇది గత ఏడాది కంటే 20 శాతం అధికమన్నమాట! గత ఆర్థిక సంవత్సరంలో 55,086 మందికి స్వల్పకాలిక రుణాల కింద రూ.334.79 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద 125 మందికి రూ.5.70 కోట్లను మంజూరు చేశారు. రైతాంగానికి స్వల్పకాలిక రుణ పథకం కింద 5,431 మందికి రూ.262 కోట్లు, కౌలు రైతులకు 745 మందికి రూ.11.41 కోట్లు, 1,111 స్వయం సహాయక సంఘాలకు రూ.49.86 కోట్ల రుణాలు ఇచ్చారు. ఈ ఏడాది రైతులకు ఖరీఫ్‌లో రూ.450 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది ఖరీఫ్ పంట రుణాలతో పోల్చుకుంటే ఇది రూ.116 కోట్లు అధికం. మరోపక్క విశాఖ డీసీసీబీలో రూ.980 కోట్ల డిపాజిట్లున్నాయి. వీటిలో రూ.600 కోట్ల వరకు అర్బన్ పరిధిలో ఉన్న బ్రాంచిల నుంచి వచ్చినవే.

ఆర్బీకేకి ఒక సహకార సంఘం

మరోవైపు ఉమ్మడి విశాఖ జిల్లాలో సహకార సంఘాల సంఖ్యను పెంచాలని డీసీసీబీ యోచిస్తోంది. ప్రస్తుతం 230 వరకు వివిధ రకాల సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని రైతు భరోసా కేంద్రానికి ఒకటి చొప్పున 380 వరకు పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సేవలు పెంచి మరింత చేరువ



డీసీసీబీ ద్వారా సేవలు విస్తృతం చేయడం ద్వారా రైతులు, వ్యాపారులకు మరింత చేరువవుతాం. ఇందులో భాగంగానే ఉమ్మడి విశాఖలో కొత్తగా 13 శాఖలను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ ఏడాది బ్యాంకు వ్యాపార లక్ష్యాన్ని రూ.2,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులకు పంట రుణాలను కూడా పెంచుతున్నాం. రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా 7 శాతం వడ్డీతో స్వల్పకాలిక పంట రుణాలిస్తున్నాం. ఏజెన్సీలో ప్రస్తుతం రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవోలు) ఉన్నాయి. ఇవి ఎంతో విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ సంఘాలకిచ్చిన రుణాల రికవరీ 100 శాతం ఉంది. దీంతో వీటిని మరింత విస్తరిస్తున్నాం.

–డీవీఎస్ వర్మ, సీఈవో, డీసీసీబీ, విశాఖపట్నం

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల విజేత తిరుపతి

- అనంతపురానికి ద్వితీయ స్థానం
- తృతీయ స్థానంలో నిలిచిన అనకాపల్లి, విశాఖ జిల్లాలు



ప్రథమ స్థానం సాధించిన తిరుపతి క్రీడాకారులకు కప్పు అందజేస్తున్న దినేష్‌కుమార్



ద్వితీయ స్థానం సాధించిన అనంతపురం




తృతీయ స్థానం సాధించిన అనకాపల్లి, విశాఖ జిల్లాల జట్లు

అనకాపల్లి టౌన్: విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జాతీయ గ్రాప్లింగ్ (కుస్తీ పోటీలు) అసోసియేషన్ చైర్మన్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మూడో సబ్ జూనియర్ గ్రాప్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాయని, విద్యార్థులు వారికి నచ్చిన దాంట్లో ప్రతిభ సాధించాలని సూచించారు. విద్యతోపాటు, క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా ప్రథమ స్థానం, అనంతపురం జిల్లా ద్వితీయ, అనకాపల్లి, విశాఖ జిల్లాలు తృతీయ స్థానం సాధించాయి. పోటీలు అనంతరం విజేత క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణరావు, కె.ఎస్.వి.సత్యనారాయణ, గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రెడ్డి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.జ్యోతిర్మయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

టూరిజం బోటు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- రుషికొండ బీచ్‌లో ఘటన



బోటును తీరానికి తీసుకు వస్తున్న లైఫ్ గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు సందర్శకులు జాలీగా బోటులో షికారు చేస్తుండగా.. అలల ఉధృతికి సముద్రంలో బోటు బోల్తా పడింది. వీరు లైఫ్‌జాకెట్స్ వేసుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు, పర్యాటకులు తెలిపిన వివరాలివీ.. చినముషిడివాడకు చెందిన ఇంటి రవి, మధురవాడకు చెందిన బొత్స సురేష్ రుషికొండ బీచ్‌కు వచ్చారు. సముద్రంలో షికారు చేసేందుకు టూరిజం బోటు ఎక్కారు. బోటులో షికారు చేస్తున్న సమయంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఓ భారీ అల బోటును ఢీ కొట్టడంతో.. బోల్తా పడింది. ఈ ఘటనలో వీరిద్దరితో పాటు బోటును నడుపుతున్న పుక్కళ్ల లక్ష్మణరావు సముద్రంలో పడిపోయారు. వీరు లైఫ్ జాకెట్స్ వేసుకోవడంతో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇది గమనించిన లైఫ్ గార్డ్స్ వెంటనే ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని పర్యాటకులు, బోటును సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న మెరైన్ పోలీసులు బీచ్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా.. వారం రోజుల నుంచి వరద నీటి ప్రవాహంతో సముద్రంలో నీటిమట్టం పెరగడంతోపాటు అలల ఉధృతి ఎక్కువగా ఉంది. దీనికి తోడు బలంగా గాలులు వీస్తున్నాయి. ఈ సమయంలో బోటు షికారు నిర్వహించడంపై పలువురు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

బధిరుల స్పోర్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షునిగా చిరంజీవి



నియామక పత్రాలతో నూతన కమిటీ

అనకాపల్లి టౌన్: జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ బధిరులు అధ్యక్షునిగా కొణతాల చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్.శాంతిబాబు, సహాయ కార్యదర్శిగా పల్లా లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా ఎం.రాజు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.దేవిప్రసాద్, కాపుశెట్టి తులసి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ బధిరుల సంఘం అధ్యక్షుడు వేదుల చంద్రశేఖర్ వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

చెరువులో పడి చూడి గేదె మృతి

చీడికాడ: మండలంలోని అర్జునగిరిలో చెరువులో పడి చూడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన నిరుపేద మహిళా రైతు యామల బంగారమ్మ మూగ కుమారుడు గణేష్ ఆదివారం ఉదయం మేత కోసం కళ్లానికి సమీపంలో చెరువు వద్దకు తోలుకెళ్లాడు. అక్కడ చెరువులో సేద తీరేందుకు దిగిన గేదె ఊపిరాడక మృతి చెందింది. దీనికి ఇటీవల బీమా కాలపరిమితి ముగియడంతోపాటు రూ.60 వేల వరకు నష్టపోయిన బాధితురాలికి దాతలు ఆదుకోవాలని సర్పంచ్ బి.రమాదేవి కోరారు.

నీటి బొట్టు.. ఒడిసి పట్టు

- భూగర్భ జల మట్టం పెరిగేలా ప్రభుత్వం చర్యలు
- వర్షపు నీటిని భూమిలో ఇంకించేలా ప్రణాళిక
- ప్రభుత్వ స్థలాల్లో 253 ఇంకుడు గుంతల తవ్వకానికి శ్రీకారం



బుచ్చెయ్యపేటలో నిర్మించిన ఇంకుడు గుంత (ఫైల్)



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్: నీరు మనిషికి ప్రాణాధారం.. ఏటా వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి చుక్క నీరు దొరకని పరిస్థితి.. ఈ ప్రభావం భవిష్యత్ తరానికి ప్రమాదంగా మారకముందే ప్రభుత్వం మేల్కొంది. వర్షం రూపంలో భూమిని చేరే ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు సిద్ధమైంది. వర్షపు నీటిని ఒడిసి పడితే భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు ఇటీవల రాష్ట్రంలో పర్యటించినప్పుడు ఇక్కడి అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో డ్వామా అధికారులు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలు తవ్వించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రతి మండలంలో కనీసం 5 నుంచి 10 గుంతలు తీయించేలా చర్యలు చేపడుతున్నారు. వీటి నిర్మాణం వల్ల భూగర్భ జలమట్టం పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి మలి విడతలో మరిన్ని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం సంకల్పించింది. దీనికి అనుగుణంగా అధికారులు ప్రజల్లో చైతన్యం తేవడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

జిల్లాలో 253 లక్ష్యం

జిల్లాలో భూగర్భ జలాలు పెంపునకు దోహదం చేసేలా డ్వామా అధికారులు జిల్లా వ్యాప్తంగా 253 ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించారు. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, మాడుగుల, నర్సీపట్నం క్లస్టర్లలో 24 మండలాల్లో వీటిని ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను గుర్తించారు. అనకాపల్లి క్లస్టర్‌లో 60, యలమంచిలి క్లస్టర్‌లో 57, మాడుగుల క్లస్టర్‌లో 72, నర్సీపట్నం క్లస్టర్‌లో 64 గుంతలు తీయించనున్నారు. త్వరలో వీటి పనులను ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ఇలా..

ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తవ్వాల్సిన ప్రాంతాలను బట్టి చేపట్టనున్నారు. పెద్ద సైజు ఇంకుడు గుంతకు రూ.74,656 చిన్న సైజుకు రూ.53,200 ఖర్చు చేయనున్నారు. గంతలను తీయించనున్న పనులు మొత్తం ఉపాధి హామీ కూలీలతోనే చేయించనున్నారు. 6 మీటర్ల లోతు ఉండేలా ఇంకుడు గుంతను డిజైన్ చేశారు. సిమెంట్, ఇసుక, కంకర, తదితర సామగ్రిని, ఇంకుడు గంతల ఏర్పాటులో వినియోగించనున్నారు. నిర్ణీత లోతులో వీటిని ఉంచిన తర్వాత ఇసుకను పైభాగంలో ప్లైయాష్ ఇటుకలతో చుట్టూ చిన్న పిట్టగోడ లాగా కడతారు. దీంతో ఇంకుడు గుంత నిర్మాణం పూర్తయి వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకుతుందని డ్వామా అధికారులు చెబుతున్నారు.

ఎక్కడెక్కడ గుంతలు తీస్తారంటే..

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రులు, బల్క్ మిల్క్ సెంటర్లు, ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న అన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ భవనాలు వద్ద ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేయనున్నారు.

ప్రయోజనాలెన్నో...

- ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల జల సంరక్షణ పెరుగుతుంది.
- వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకుతుంది. భూగర్భ జలాల పెంపుదలకు దోహదపడుతుంది.
- బోర్లకు అవసరమైన నీటి లభ్యత శాతం పెరుగుతుంది.
- భవిష్యత్ తరాలకు నీటి కొరత ఏర్పడకుండా ఉపయోగపడతాయి.
- పారిశుధ్య నిర్వహణ మెరుగుపడి దోమల బెడద తగ్గడంతోపాటు రోగాలు దూరమవుతాయి.

భూగర్భ జలాల పెంపునకు దోహదం



ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల భూగర్భ జలాల పెంపునకు దోహదపడతాయి. వీటి వల్ల భూగర్భ జలాలు మరింత పైకి వచ్చే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 253 గుంతలు తీయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్థలాల గుర్తింపు దాదాపుగా పూర్తయింది. భూమిలోకి వర్షపు నీరు చేరడం వల్ల బోర్లలో సమృద్ధిగా నీళ్లు అందుబాటులో ఉంటాయి. సాగునీటి బోర్లకు కూడా ఉపయోగమే.

– ఇ.సందీప్, డ్వామా పీడీ, అనకాపల్లి

రాత్రి వేళ తహసీల్దార్ కార్యాలయంలో రిటైర్డ్ వీఆర్వో

- రికార్డులు తారుమారుకే అని ఆరోపణలు
- వ్యక్తిగత అంశంపై వివరాల సేకరణకే రప్పించామని అధికారి వివరణ



తహసీల్దార్ కార్యాలయంలో సర్వే అసిస్టెంట్‌తో రిటైర్డ్ వీఆర్వో సూర్యనారాయణ

మాకవరపాలెం: తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి సమయంలో రిటైర్డ్ వీఆర్వో కనిపించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. రాత్రి వేళలో ఆయనకు ఏం పనంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన లాలం సూర్యనారాయణ గతంలో వీఆర్వోగా పనిచేసి రిటైరయ్యారు. ఈయన శనివారం రాత్రి 10 గంటల అనంతరం గిడుతూరు సచివాలయ సర్వే అసిస్టెంట్ శ్రీనుతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో కనిపించారు. రెవెన్యూ రికార్డులకు సంబంధించిన విషయాలపై మాట్లాడుతుంగా తీసిన ఫొటోలు, వీడియో ఆదివారం సోషల్ మీడియాతోపాటు వివిధ వాట్సప్ గ్రూపుల్లో వైరల్ అయ్యాయి. దీంతో శనివారం మొహర్రం సందర్భంగా కార్యాలయానికి సెలవు కావడం, పైగా రాత్రివేళ కార్యాలయంలో కనిపించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గిడుతూరు సచివాలయం పరిధిలోని బయ్యవరానికి సంబంధించి రికార్డులు తారుమారు చేసేందుకే ఆ సమయంలో రిటైర్డ్ వీఆర్వోను రెవెన్యూ అధికారులు రప్పించారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనప్పటికీ రెవెన్యూ అధికారులు ఆ సమయంలో ఆయన్ను కార్యాలయంలోకి అనుమతించడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఆరోపణల్లో వాస్తవం లేదు..

రెవెన్యూ కార్యాలయంలో సెలవు రోజు రాత్రి రిటైర్డ్ వీఆర్వోతో కలిసి రికార్డులు తారుమారు చేస్తున్నట్టు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని తహసీల్దార్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. బయ్యవరం గ్రామానికి సంబంధించి రీసర్వేపై డీఎల్ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్) నమోదు చేస్తున్నామని, సూర్యనారాయణకు ఉన్న భూమికి సంబంధించిన వివరాలపై సర్వే అసిస్టెంట్ పిలవడంతోనే ఆయన వచ్చాడని తహసీల్దార్ తెలిపారు.

‘బీజేపీ విధానాలను వ్యతిరేకించండి’



సదస్సులో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

అనకాపల్లిటౌన్: బీజేపీ విధానాలు దేశ సమగ్రతకు, అస్తిత్వానికి ప్రమాదకరమని అఖిలభారత వ్యవసాయ అండ్ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్ కుమార్ ఆరోపించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో భారత్ బచావో ఆందోళన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫాసిజాన్ని ఓడిద్దాం... రాజ్యాంగాన్ని రక్షిద్దాం... అనే సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మతతత్వ పాలన కారణంగా దేశంలో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని బీజేపీ అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా అందరూ రాజకీయాలకతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగిన యువకుడి మృతి



వెంకటేష్(ఫైల్)

కోటవురట్ల: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం పందూరు గ్రామానికి చెందిన బీముని వెంకటేష్ (34) చెడు వ్యసనాలకు లోనుకావడంతో ఆరోగ్యం పాడై పెరాలసిస్ స్ట్రోక్ రావడంతో ఇటీవల చికిత్స పొందాడు. దీంతో పాటు లివర్, గుండె సంబంధ వ్యాధులు కూడా ఉండడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చాక కూడా పది రోజులుగా మద్యం సేవిస్తూ చెడు వ్యసనాలను కొనసాగించసాగాడు. దాంతో వ్యసనాలను విడిచిపెట్టాలని కుటుంబసభ్యులు హెచ్చరించారు. మనస్తాపం చెందిన వెంకటేష్ శనివారం సాయంత్రం తన మామిడితోటకు వెళ్లి మద్యంలో గడ్డి మందు కలిపి తాగాడు. ఇంటికి ఫోన్ చేసి తడబడడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు తోటలోకి వెళ్లేసరికి నురగలు కక్కుతూ కనిపించాడు. వెంటనే అతనిని కోటవురట్లలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని తండ్రి గడ్డియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య కుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వరదలో మునిగి పశువుల కాపరి మృతి



రాముడు మృతదేహం

ఎటపాక: ప్రమాదవశాత్తూ గోదావరి వరదలో మునిగి పశువుల కాపరి మృతి చెందిన ఘటన ఆదివారం నెల్లిపాకలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి. చత్తీస్‌గఢ్ రాష్ట్రం మల్కనగిరి జిల్లా వెంకటాపురం ఏరియాకి చెందిన దేదారి రాముడు(50), అతడి భార్య గంగమ్మ రెండు సంవత్సరాల నుంచి ఓ రైతు వద్ద పశువులు కాస్తున్నారు. శనివారం ఉదయం పశువులు కాసేందుకు గ్రామ శివారుకు వెళ్లారు. గ్రామం చుట్టూ గోదావరి వరద రావడంతో పశువులు ఇంటికి చేరే సమయంలో వరద నీటిలో దిగాయి. పశువులను తోలుకుంటూ రాముడు కూడా నీటిలో దిగడంతో నీటిలోతు తెలియక మునిగిపోయాడు. అతడి భార్య కూడా పశువులను తోలుకుని ఇంటికి వచ్చేసింది. రాత్రయినా అతని జాడ తెలియక పోవడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం వరద నీటి వద్దకు వెళ్లి చూడగా రాముడు మృతదేహం నీటిపై తేలి ఉంది. మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిమిత్తం భద్రాచలం తరలించారు.

షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మధురవాడ : విశాఖ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మధురవాడలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఇల్లాపు వెంకరావు, సెక్రటరీగా ముద్దాడ కిశోర్‌కుమార్, తదితర కార్యవర్గం ఎన్నికైంది.

అధికారి బంగారు గొలుసు కాజేసిన హిజ్రాలు

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి నుంచి అడ్డతీగల వెళుతున్న స్థానిక అధికారిని ఏమార్చి మెడలోని గొలుసు తస్కరించిన హిజ్రాలు ఉదంతం ఇది. ఉపాధి హామీ కార్యాలయానికి చెందిన అధికారి తెలిపిన వివరాలిలా వున్నాయి. ఆయన శనివారం తన మోటారు సైకిల్‌పై ఎల్లవరం వెళుతుండగా చెట్ల పక్కనుంచి సడన్‌గా వచ్చిన హిజ్రాలు ఒక్కసారిగా మీద పడి డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. జేబులో వున్న చిల్లర ఇస్తుండగా సరిపోదు ఇంకా ఇవ్వాలంటూ చక్కిలిగింతలు పెట్టారని, ఏదో విధంగా వారి బారి నుంచి బయటపడి కొంత దూరం వెళ్లి చూసుకుంటే మెడలో గొలుసు పోయిందని, వెనుకకు చూసేసరికే వారు ఒక కారులో పరారవుతూ కనిపించారని ఆ అధికారి తెలిపారు. ఈ మేరకు అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీపురంలో పశువుల పాక దగ్ధం

- రూ.70 వేల ఆస్తి నష్టం
- మూడు పాడి పశువులకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో కాలిన పశువులకు చికిత్స చేస్తున్న డెయిరీ వైద్య సిబ్బంది



కాలి బూడిదైన పశువుల పాక, వరి విత్తనాలు

చోడవరం రూరల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక రైతు పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. మూడు పాడి పశువులతో తీవ్రంగా కాలిన గాయాలతో బయటపడ్డాయి. గ్రామానికి చెందిన మహాదేవు చిన్నంనాయుడు మధ్యాహ్నం భోజనానికి పశువులను పాకలో కట్టి ఇంటికి వచ్చాడు. సుమారు 2.15 గంటల సమయంలో పశువుల పాకకు నిప్పంటుకుని మంటలు ఎగియడంతో అది చూసిన చుట్టుపక్కల రైతులు, గ్రామస్తులు చేరుకున్నారు. మంటల నుంచి ముందుగా పశువులను బయటకు తరలించారు. అప్పటికే ఒక పాడి పశువుకు కన్ను భాగం మరో పశువుకు రొమ్ములు కాలిపోగా, పెయ్యి చర్మం కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న విశాఖ డెయిరీ వైద్య సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని పాడిపశువులకు చికిత్స నిర్వహించారు. సోమవారం ఉదయానికిగాని పశువులకు కాలిన గాయాల తీవ్రత బయటపడదన్నారు. సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక దళాధికారి బి.వి. రామస్వామి తన సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. సర్పంచ్ సిరిసోళ్ల ఆదిగణపతినాయుడు తదితరులు బాధితుడిని పరామర్శించారు.

చెరువులో మునిగి రైతు మృతి



అప్పలనాయుడు మృతదేహం



రైతు మునిగి మరణించిన రామసాగరం చెరువు

కె.కోటపాడు: మండలంలోని పోతనవలసలో రామసాగరం చెరువులో మునిగిపోయి రైతు నెక్కల అప్పలనాయుడు(55) శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతిపై భార్య నారాయణమ్మ ఆదివారం ఎ.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.రామకృష్ణ వివరాల ప్రకారం... అప్పలనాయుడు పొలంలో వరినాట్లు వేస్తున్నారు. సాయంత్రానికి మరికొంత వరి ఆకు అవసరం వచ్చింది. దాంతో తట్టతో వరినారు పట్టుకుని తన పొలానికి వస్తున్నాడు. ఈ క్రమంలో రామసాగరం చెరువు లోపలి నుంచి దాటే క్రమంలో మునిగిపోయాడు. రాత్రయినా భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలించారు. చెరువులో తేలాడిన తట్ట, వరినారు గుర్తించి అనుమానంతో గాలించగా, నీటి అడుగు భాగంలో మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్.ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



రామునాయుడు మృతదేహం

మాడుగుల రూరల్: మండలంలోని పోతనపూడి అగ్రహారంలో విద్యుదాఘాతానికి గురై ముచ్చకర్ల రామునాయుడు(52) ఆదివారం మృతి చెందాడు. వీరవల్లి అగ్రహారం శారదానది బ్రిడ్జి సమీపంలో ఏబీ స్విచ్ ఆన్ చేస్తుండగా, షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వ్యవసాయ కూలీగా పనిచేసే అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ కోరుకొండ భవానీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కోరుకొండ సూరిప్పారావు, సాంబమూర్తి, పరామర్శించారు.

చిన్నతనం నుంచే శారీక దారుఢ్యం పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అనకాపల్లిటౌన్: చిన్నతనం నుంచి శరీరాన్ని సరైన ఆకృతిలో మలుచుకోవాలని డీఎస్పీ సుబ్బరాజు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఆదివారం రాత్రి జిల్లా స్థాయి బాడీబిల్డర్ అసోసియేషన్, అబ్దుల్ కలాం సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాడీ బిల్డింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. తాను విద్యనభ్యసించే రోజుల్లో శరీరదారుఢ్యం కోసం వ్యాయామం చేసేవాడ్ని అని అన్నారు. అంతకుముందు అసోసియేషన్ సభ్యులు డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కేలం చంద్రశేఖర్, కార్యదర్శి కోరిబిల్లి సోమునాయుడు, అబ్దుల్‌కలాం సేవా సంఘ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, నేషనల్ బాడీబిల్డర్ అమలోజు శ్రీను, క్లబ్ సభ్యులు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై అర్ధనగ్న ప్రదర్శన



దళిత ఐక్యవేదిక నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

నర్సీపట్నం: మణిపూర్ ఘటనను నిరసిస్తూ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని అబిద్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మానవహారంగా ఏర్పడి మణిపూర్ ఘటనకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై ఐక్యరాజ్య సమితి, మానవ హక్కుల కమిషన్ తక్షణమే స్పందించాలన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మౌనం వీడాలన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి కేంద్రం కొమ్ముకాస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రపతి జోక్యం చేసుకుని అక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఐక్యవేదిక జిల్లా చీఫ్ అడ్వైజర్ ఎల్.ఎల్లాజీ, నాయకులు వై.పాపారావు, బి.నాగరాజు, ఎం.అప్పారావు, అల్లంపల్లి ఈశ్వరరావు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కె.అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిఘా మరింత కట్టుదిట్టం



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేష్‌కుమార్



రాజవొమ్మంగిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన వాల్ పోస్టర్లు

చింతపల్లి రూరల్: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని బలపం, లోతుగెడ్డ, అన్నవరం ప్రాంతాల్లో పోలీసులు ముందు జాగ్రత్తగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యలయాల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ రమేష్ ఆధ్వర్యంలో నిఘా ముమ్మరం చేశారు.

కొయ్యూరు: మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో బాలరేవుల–కొయ్యూరు రహదారిలో తనిఖీలు నిర్వహించారు. కన్నవరం, బొడ్డుమామిడి, గోదుమలంక, నల్లబిల్లి, పోకలపాలెం, బాలరేవుల గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

రాజవొమ్మంగి: మావోయిస్టుల వారోత్సవాలకు వ్యతిరేకంగా మండల కేంద్రం రాజవొమ్మంగిలో ఆదివారం పలు చోట్ల వాల్ పోస్టర్లు వెలిశాయి. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, ప్రభుత్వ ఆస్తులు అయిన బస్సులు తదితర విలువైన సంపదను ధ్వంసం చేస్తూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న పలు అంశాలు పోస్టర్లలో కనిపించాయి.

వై.రామవరం: సరిహద్దు అటవీ ప్రాంతమైన ఏవోబీలో ఏఎస్ఎస్, సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ తదితర భద్రత దళాలతో భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వనరుల మినీ కేంద్రం ప్రారంభం



నూతలగుంటపాలెంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనరుల మినీ కేంద్రం

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో ప్రకృతి వ్యవసాయం సాగుకు అవసరమైన ఎరువులు, కషాయాలు రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రకృతి వనరుల మినీ కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ లచ్చన్న ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో జీవామృతం, ఘన జీవామృతం, వివిధ కషాయాలు అందుబాటులో ఉంచనున్నట్టు ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డి.రమణ తెలిపారు. రైతు భరోసా కేంద్రాలున్నచోట పెద్ద వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతారన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేపలు, బెల్లంతో మీనామృతం తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు.

‘50 శాతం రాయితీపై రుణాలివ్వాలి’



మీడియాతో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి రూరల్: గొర్రెలు, మేకల పెంపకందార్లకు 50 శాతం సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల మేర రుణాలివ్వాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గొర్రెల సహకార సంఘాలకు రూ.88 కోట్లు ఎన్‌సీడీసీ నిధులు విడుదల చేయాలని, 50 ఏళ్లు దాటిన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మేకలకు, గొర్రెలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద త్వరలో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మన్‌కీ బాత్ ప్రదర్శన



మోదీ ప్రసంగాన్ని వింటున్న బీజేపీ నేతలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంతో పాటు పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ 103వ ఎపిసోడ్ ప్రసారాన్ని టీవీల ద్వారా ప్రదర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, పార్టీ స్థానిక నాయకులు పలు చోట్ల ఈ కార్యక్రమాన్ని ప్రజలతో కలిసి తిలకించారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
బ్రో	:	సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	:	సత్యనారాయణ స్క్రీన్-2
బ్రో	:	షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)	:	షిర్డిసాయి
బ్రో	:	వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 293 మందింది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 218 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

తీరు మారిన పల్లెలు

- సీఎం జగన్ పాలనలో గ్రామాల విశేష అభివృద్ధి
- విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట
- అడుగడుగునా అభివృద్ధి బాటలు

అనకాపల్లిటౌన్: జాతిపిత మహాత్మాగాంధీ పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్నారు. దేశవ్యాప్తంగా ఆయన బాటలో నడుస్తున్న రాష్ట్రాల్లో ముందంజలో ఉన్నది మన రాష్ట్రమేనంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పల్లెలకు ఇస్తున్న ప్రాధాన్యత అలాంటిది. గతంలో ప్రతి అవసరానికి పట్టణాలకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. ఇపుడా పరిస్థితి చాలా వరకు తగ్గింది. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా కనీస అవసరాలన్నింటికీ గ్రామాలే ఆసరాగా నిలుస్తున్నాయి.

మారేడుపూడి ‘మెచ్చు’తునక

అనకాపల్లి మండంలోని శివారు గ్రామం మారేడుపూడి. ఇక్కడి నుంచి అనకాపల్లి పట్టణానికి 18 కి.మీ. దూరం. పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ మండలానికి, అనకాపల్లి మండంలోని పలు గ్రామాలకు ఈ ఊరు అనుసంధానంగా ఉంటుంది. గ్రామంలో మొత్తం జనాభా 2,330. గతంలో గ్రామస్తులు ఏ అవసరానికైనా ఇటు అనకాపల్లి, లేకుంటే పరవాడ వెళ్లాల్సి వచ్చేది. జగనన్న సంక్షేమ, అభివృద్ధి పాలనలో గ్రామానికి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. నాడు-నేడు పథకంలో స్కూల్‌ను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి పరిచారు. వీటికి రూ.96.63 లక్షలు వెచ్చించారు. జాతీయ రహదారికి ఆనుకొని మారేడుపూడి మీదుగా శీరంశెట్టివాని పాలెం వరకు రూ.2.50 కోట్లతో రెండున్నర కిలోమీటర్ల మేర నూతన రహదారిని నిర్మించారు. దీంతో పట్టణాలకు మేమేం తీసిపోలేదంటూ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మారేడుపూడి గ్రామ సచివాలయ భవనం

గ్రామంలో అభివృద్ధి పనులు

- గ్రామంలో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలను రూ.18.33 లక్షలతో అభివృద్ధి జరిగింది.
- రూ.25 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని ఏర్పాటు చేశారు.



నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల

- ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు రూ.12.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం
- రూ.1.50 లక్షలతో మంచినీటి ట్యాంకు ఏర్పాటు
- రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- రూ.17.50 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణంలో ఉంది.
- గ్రామంలో ఇళ్లులేని 146 మంది అర్హులకు జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో ఇప్పటికే 20 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని, గృహప్రవేశం కూడా జరిగింది. మిగిలిన వాటిని ఈ ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.
- గ్రామంలో ఇంటింటికీ కుళాయి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

సదుపాయాలు పెరిగాయి



గ్రామంలో అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలూ అందుతున్నాయి. వలంటీర్ల ద్వారానే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతున్నాయి. జగనన్న సురక్ష ద్వారా మా పిల్లలకు కావాల్సిన ధ్రువపత్రాలను వారం రోజుల్లోనే ఉచితంగా అందుకున్నాను.

– సమ్‌సీర్‌సింగ్, గ్రామస్తుడు

ఇప్పుడా భయం లేదు



గతంలో గ్రామంలో ఉండాలంటే భయపడేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ తోపాటు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి వచ్చి వైద్యం అందిస్తున్నారు. వారానికి రెండుసార్లు వైద్యులు విలేజ్ క్లినిక్‌లకు వచ్చి వైద్యసేవలతోపాటు, ఉచితంగా మందులిస్తున్నారు.

– మీర్‌కౌర్, గృహిణి, బీసీ కాలనీ

శరవేగంగా గ్రామాభివృద్ధి



ఇటీవల కాలంలో గ్రామం బాగా అభివృద్ధి చెందింది. మండలానికి శివారు గ్రామమైనప్పటికీ ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. రూ.కోట్లలో నిధులు వెచ్చించడంతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. అరకొర సమస్యలున్నప్పటికీ ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కార దిశగా కృషి చేస్తున్నాం.

– జగదీశ్వరి, పంచాయతీ కార్యదర్శి

క్రీడలతో మానసిక ఉల్లాసం

అనకాపల్లిటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు ఆరోగ్యకర జీవనానికి దోహదపడతాయని పట్టణ ఎస్‌ఐ దివాకర్‌యాదవ్ అన్నారు. విశాఖ ఫైనాన్షియర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గవరపాలెం జీవీఎంసీ చిన్నహైస్కూల్లో క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరికీ క్రీడలపై ఆసక్తి పెరిగిందన్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలో వ్యాయామంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. పోటీల్లో కాండ్రేగుల ఉమ జట్టు విన్నర్‌గా, కోరిబిల్లి యుగంధర్ జట్టు రన్నర్‌గా నిలియాయి. అనంతరం ఎస్‌ఐ దివాకర్‌యాదవ్‌ను సంక్షేమ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు జోగినాయుడు, అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి జగన్, కోశాధికారి సన్యాసినాయుడు, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పట్టణ ఎస్‌ఐ దివాకర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

నేడు ఐద్వా బస్సు యాత్ర



బస్సు యాత్ర విజయవంతానికి ప్రదర్శన చేస్తున్న ఐద్వా నేతలు

అనకాపల్లి రూరల్: జిల్లాలో సోమవారం చేపట్టనున్న ఐద్వా బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిల్లి మాణిక్యం పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బస్సు యాత్ర వివరాలను ఆదివారం వివరించారు. తొలుత బస్సు యాత్ర పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాల నియంత్రణే లక్ష్యంగా, ప్రజల్లో అవగాహనకు బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు అనకాపల్లి బస్ కాంప్లెక్స్ సమీపానికి చేరుకోనున్న బస్సు యాత్రకు అందరూ ఘన స్వాగతం పలకాలని ఐద్వా నేతలు కోరారు. అక్కడి నుంచి కశింకోట, మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, అడ్డురోడ్డు, నక్కపల్లి ప్రాంతాల్లో బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ సంయుక్త కార్యదర్శి వరలక్ష్మి, ప్రతినిధులు రూపాదేవి, వరలక్ష్మి, శ్రీదేవి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త



తేగాడ కేజీబీవీలో మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కశింకోట: అపరిచిత వ్యక్తుల పట్ల మహిళలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కశింకోట అదనపు ఎస్‌ఐ జక్కుల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని తేగాడ గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం సీడ్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్ల ద్వారా ఉద్యోగాలు, ఉపాధి, ప్రేమ పేరిట వచ్చే ఫోన్లను విశ్వసించరాదన్నారు. పూర్తిగా నమ్మకం ఉంటే తప్ప ఎవరితోనూ ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వాహనాలపై వెళ్లరాదని హెచ్చరించారు. మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయని, వాటిని అవసరమైనప్పుడు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. మహిళలపై హింస, అక్రమ రవాణాను అరికడదాం-సమాజ గౌరవాన్ని పెంచుదాం అని నినదించారు. సీడ్ ఆర్గనైజేషన్ సమన్వయకర్తలు కనకమహాలక్ష్మి, సంతోష్‌కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు

అనకాపల్లి రూరల్: పని ప్రదేశంలో మహిళా కార్మికులు, ఉద్యోగినులు లైంగిక వేధింపులకు గురవుతున్నారని శ్రామిక మహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ నాయకురాలు రమాదేవి అన్నారు. స్థానిక దొడ్డి రామనాయుడు భవన్‌లో ఆదివారం గూనూరు వరలక్ష్మి అధ్యక్షతన శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో బ్రాండిక్స్, జీడిపిక్కల పరిశ్రమలు, పలు దుకాణాలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనేక మంది మహిళా కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఎటువంటి చట్టాలు అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు, వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ రూపాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.



శ్రామిక మహిళా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు రమాదేవి

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పారశాస్త్ర అధ్యాపకుడు కర్రి మల్లేశ్వరరావు పదవీ విరమణ సన్మానసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయాధికారి ఎస్. రూపావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్ల పాటు మల్లేశ్వరరావు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదన్నారు. మల్లేశ్వరరావు దంపతులను ప్రిన్సిపాల్ విజయకుమార్, శ్రీకాకుళం జిల్లా సమన్వయ అధికారి ఎస్. బాలాజీ నాయక్‌లు అధ్యాపకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్లేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న గురుకుల పాఠశాలల అధ్యాపకులు

సోనూసూద్ జన్మదినాన గొడుగుల పంపిణీ



సోనూసూద్ జన్మదినం పురస్కరించుకుని నిరుపేదలకు గొడుగులు పంపిణీ

అనకాపల్లిటౌన్: ప్రఖ్యాత నటుడు, కోవిడ్ విపత్తులో ప్రజలను ఆదుకోవడంలో ముందున్న సోనూసూద్ జన్మదిన వేడుకలు స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోనూసూద్ అనకాపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి కొడుకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, గొడుగులు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనూసూద్ కరోన సమయంలో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా చేసిన సేవలను వివరించారు. అనంతరం 300 మందికి గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కాండ్రేగుల నాయుడు, రేబాక మధు, కాండ్రేగుల రమణ, మద్దాల శ్రీను, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, తాడి శాంతి, గుండా సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహ మాసోత్సవాలు



పిండి వంటలను పరిశీలిస్తున్న అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు

అనకాపల్లిటౌన్: అంతర్జాతీయ స్నేహ మాసోత్సవ వేడుకలు ఆగస్టు 6 వరకూ నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పిండి వంటల పోటీలు, ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ ఏటా క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆగస్టు 6న అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నూకాంబికా.. నమోస్తుతే



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో, ఈ రోజు పూజిస్తే కోరిన వరాలిస్తుందన్న నమ్మకంతో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి, అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు తమ పిల్లలకు పాలిచ్చేందుకు అనువుగా ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అనకాపల్లిటౌన్: ఆరోగ్యవంతుడైన వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణదానం చేసినట్టేనని మిత్రా అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ప్రతినిధి గుండా రమేష్‌గుప్తా అన్నారు. స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రతీ ఏడాది స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకుని, రక్తదానంతో పాటు వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతులై వ్యక్తులు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. విశాఖ ఏఎస్ రాజా వలంటీర్ బ్లడ్ బ్యాంక్‌కు 60 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు.

ఆదివాసీల హక్కుల సాధనకు పాదయాత్ర



పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్

అనకాపల్లిటౌన్: జిల్లా నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీల పాదయాత్రను ఆగస్టు 4 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్టు అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 4న నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మొదలయ్యే పాదయాత్ర ఆగస్టు 7 నాటికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సంఘ కార్యాలయంలో ఆదివారం పాదయాత్ర కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాలు ఏర్పడ్డాక జిల్లాలో మిగిలిపోయిన ఆదివాసీలు ఐటీడీఏ రక్షణ పరిధి బయట ఉండిపోయారని పేర్కొన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు పాడేరు ఐటీడీఏ ఆదివాసీలందరికీ రక్షణ కవచంగా ఉండేదని, ప్రస్తుతం అది అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసిపోయిందన్నారు. దీంతో అనకాపల్లిలో మిగిలిపోయిన షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీల భూములకు రికార్డులు మార్చేసి గిరిజనేతరులు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. స్పందనలో ఫిర్యాదు చేసినా, పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించాలని దివంగత సీఎం వైఎస్సార్ నియమించిన కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. ఈ సిఫార్సులను తక్షణమే అమలు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘ నేతలు

అనకాపల్లి రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ అనకాపల్లి సమితి కన్వీనర్ కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కొడుగంటి గోవిందరావు భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అనకాపల్లి జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల్ని యాజమాన్యాలు, ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఉద్యోగులకు కొత్త పీఆర్సీలోనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ సంఘ ప్రాంతీయ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్‌ను మార్కెట్ సరుకుగా మార్చాలనుకునే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ఉద్యోగులంతా వ్యతిరేకించాలన్నారు. ప్రజలకు భారంగా మారే విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని, 2న అన్ని సర్కిల్ కార్యాలయాలు వద్ద ఆందోళన చేస్తామని వెల్లడించారు. సమావేశంలో సంఘ నాయకులు వాయిబోయిన శేఖర్, బండారు వెంకటేష్, విత్తనాల పోతురాజు, సూర్యనారాయణ, సత్యనారాయణ, విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు కొటాన మాధవి, దాడి అప్పారావు, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.